క్లుప్తంగా

వైఎస్సార్ సీపీని ఆదరించరూ!


ప్రజలతో మాట్లాడుతున్న పద్మ

గుడుపల్లె: అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ తల్లి పద్మ ప్రజలను అభ్యర్థించారు. శుక్రవారం ఆమె మండలంలోని బిసానత్తం, అత్తినత్తం గ్రామాలలో పర్యటించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్న తన కుమారుడిని ఒక కుటుంబ సభ్యునిలా భావించాలని విజ్ఞప్తి చేశారు. రాబోవు ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ క్రిష్ణమూర్తి, సర్పంచ్ దేవరాజు, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



రామకుప్పం: మండలంలోని మణీంద్రంలో పెద్దపులి గంగమాంబ దేవీ విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హోమం చేసి పూర్ణాహుతితో ముగించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మండలంలోని మండిపేట కోటూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వీరప్పగారి చెంగప్ప శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెంగప్ప కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, మాజీ సర్పంచ్ అయ్యాకన్ను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'సీస్' పరీక్ష

పలమనేరు: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సీస్(స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే-20023) విద్యార్థుల సామర్థ్య పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలోని 15 ప్రభుత్వ,10 ప్రైవేటు పాఠశాల్లోని 3,6,9 తరగతులకు చెందిన 1,450మంది పిల్లలకు ఈ పరీక్షను నిర్వహించారు. ఎంఈఓలు లీలారాణి, బాలసుబ్రమణ్యం పర్యవేక్షించారు. సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపిక


హర్షిత

పలమనేరు: పలమనేరుకు చెందిన హర్షిత సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు జేఎన్‌టీయూ అనంతపూర్ తరఫున ఎంపికైంది. ఈమె స్థానిక మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సౌత్‌జోన్ కబడ్డీ క్రీడాకారుల ఎంపికలో జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలలకు చెందిన 210మంది క్రీడాకారులు హాజరుకాగా వీరిలో12మంది తుది జట్టుకు ఎంపికయ్యారు. ఈ జట్టులో హర్షిత ఉంది. డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఈమె పాల్గొననుంది.

అన్నీ విజయాలే కలగాలి

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ


ఆయుధ పూజలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: రాబోవు రోజుల్లో వైఎస్సార్‌సీపీకి అన్నీ విజయాలే కలగాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే హాజరయ్యారు. మండల ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్. రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, సింగిల్‌విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగా రెడ్డి, జెడ్పీ ప్రత్యేక ఆహ్వానితులు చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శులు సుహేబ్, తమ్మిరెడ్డి, మాకయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటరమణా రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరినాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్రబల్లి శ్రీనివాసులు, ఎంపీడీఓ అబ్దుల్ రహీం పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనే లక్ష్యం

-మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే


హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ప్రజలకు పారదర్శక పాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పునరుద్ఘాటించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తొలుత అజెండా ప్రకారం శాఖల వారీగా అధికారులు మండలంలో అభివృద్ధి పనుల గురించి నివేదించారు. తరువాత ప్రజాప్రతినిధులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో ఇంటింటి సర్వే, పింఛన్ల పంపిణీ, యాప్‌ల వినియోగం, నవరత్నాల అమలులో భాగస్వామ్యం, రేషన్ డోర్ డెలివరీ, ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులు మంజూరు చేయడంలో ఎక్కడా జాప్యం లేకుండా అధికారులు బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలన్నారు. పక్కా గృహాలు అవసరమైన అర్హులు చేత దరఖాస్తులు చేయించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు తీసుకోవాలన్నారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు ఊరటనిచ్చిన వర్షం

పెద్దపంజాణి: మండలంలోని పలుచోట్ల శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో వేరుశనగ రైతులకు ఊరట లభించింది. కొన్నిరోజులుగా ట్యాంకర్ల నీటితో వేరుశనగ పొలాలకు తడులు ఇచ్చి ఒబ్బిడి పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరూ జాబితాలో ఉండాలి

సదుం: అర్హులైన ప్రతి ఓటరూ జాబితాలో ఉండేలా బీఎల్‌ఓలు చూడాలని తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశించారు. 18, 19 ఏళ్లు ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి, ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. 4, 5 తేదీలలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బీఎల్‌ఓలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి మార్పులు-చేర్పులు, సవరణ, నమోదుకు వినతులు స్వీకరించాలని కోరారు.

పాలమందలో పీలేరు ఎమ్మెల్యే చింతల


జెడ్పీటీసీతో మాట్లాడుతున్న పీలేరు ఎమ్మెల్యే

సదుం: మండలంలోని పాలమంద పంచాయతీ పెద్దూరులోని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి స్వగృహానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం విచ్చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను జెడ్పీటీసీ ఆయనకు వివరించారు. పలు అంశాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ పీలేరు మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి


ట్రై సైకిల్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పం: వివిధ వార్డుల్లో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం కొందరు వార్డు కౌన్సిలర్ల విజ్ఞప్తిపై ఆయన వార్డుల్లో పర్యటించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై స్పందించారు. 13వ వార్డులోని సంపంగి నగర్‌లో డ్రైనేజ్ కాలువలు లేక మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. అలాగే 10వ వార్డు శాంతినగర్‌లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు నివేదించడంతో కొత్తగా బోరు వేసి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. అనంతరం శెట్టిపల్లె వద్ద ఉన్న బధిర పాఠశాలలో దివ్యాంగుల పిల్లలకు ట్రై సైకిల్ పంపిణీ చేశారు. కౌన్సిలర్లు, నేతలు పాల్గొన్నారు.

ఆర్‌బీకే, ఉలవ పంట పరిశీలన

గంగవరం: మండలంలోని గంగవరం-3, కీలపట్ల ఆర్‌బీకేలను జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ, పుంగనూరు ఏడీఏ శివకుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది రైతులకు అన్నివేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన యూరియా, కాంప్లెక్స్, డీఏపీలను నిల్వ ఉంచుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సరైన సేవలను త్వరితగతిన అందివ్వడంలో ముందుండాలన్నారు. పరిసరాల్లో ఉలవ పంటను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ


హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి ఆరీఫా షేక్

కుప్పం: స్థానిక మునిస్వామిపురంలోని బీసీ హాస్టల్‌ను కుప్పం కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. హాస్టల్ వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? వంటకాలు రుచికరంగా ఉన్నాయా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పెట్టేందుకు సిద్ధంగా ఉన్న వంటలు, సాంబారును పరిశీలించారు. అలాగే రికార్డులనూ పరిశీలించారు. విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

సోమలలో పరీక్ష కేంద్రాలు..

సోమల: ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎస్ఏఎస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పెద్ద ఉప్పరపల్లెలో ఏంఈఓ-1 శ్రీరాములు, మండల కేంద్రంలో ఎంఈఓ-2 శివరత్నమ్మ తనిఖీ చేశారు.

ఇరువర్గాల ఘర్షణ నలుగురికి గాయాలు

రామకుప్పం: భూ వివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఇరువర్గాల ఘర్షణలో నలుగురు గాయపడిన సంఘటన మండలంలోని అత్తికుప్పంలో జరిగింది. ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు కథనం.. అత్తికుప్పంకు చెందిన వెంకట్రామిరెడ్డి, రామిరెడ్డిల మధ్య కొన్నేళ్లుగా భూవివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం రెండు కుటుంబాల వ్యక్తులు పొలం వద్ద ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో రామిరెడ్డి, కుమార్‌రెడ్డి,దేవరాజుల రెడ్డిలకు తలపై గాయాలయ్యాయి. వెంకట్రామిరెడ్డి కుటుంబసభ్యుల్లో ఒకరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు రామకుప్పం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో కుప్పం ఆసుపత్రికి తరలించారు. రామిరెడ్డి కుమార్తె సుగుణ ఫిర్యాదు మేరకు వెంకట్రామిరెడ్డి, ఆనందరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

పురాతన ఆలయాలకు మహర్దశ


ఆలయ పనులపై చర్చిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, వెంకటరెడ్డి యాదవ్, భాస్కర్‌రెడ్డి తదితరులు

- చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప
- శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల పరిశీలన
- 19 నుంచి మూడు రోజులు ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం

పుంగనూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురాతన ఆలయాలకు మహర్దశ ప్రాప్తించిందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. పట్టణంలో హనుమంతరాయునిదిన్నెలోని పురాతన శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను శుక్రవారం ఎంపీతోపాటు పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ చైర్మన్ నాగరాజారెడ్డి తదితరులు పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో పురాతన ఆలయాలకు జీర్ణోద్ధరణకు కోట్లాది రూపాయలు వ్యయం చేశారన్నారు. అంజనేయస్వామి ఆలయాన్ని రూ.2 కోట్లతో పునఃనిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 19న ఆలయంలో పూజలు ప్రారంభమై, 22న స్వామివారిని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. మంత్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయరామిరెడ్డి, నటరాజ పాల్గొన్నారు.

సచివాలయ సేవలు ఆదర్శం


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీపీ

పుంగనూరు: సచివాలయాల సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాగానిపల్లె సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి వినతుల స్వీకరణ, నమోదు, పరిష్కారంపై ఆరా తీశారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని, కార్యదర్శులు, వలంటీర్లు మరింతగా సేవలు అందించాలని కోరారు.

ఆటోడ్రైవర్ల విరాళం


ఆటోడ్రైవర్లు ఇస్తున్న చిత్రపటాలు, గడియారం

సదుం: మండలంలోని నడిగడ్డ సచివాలయానికి ఆటోడ్రైవర్లు మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాలను, గోడ గడియారాన్ని శుక్రవారం విరాళంగా అందజేశారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతున్నట్టు చెప్పారు. వాహన మిత్ర పథకం ఆటోడ్రైవర్లకు ఎంతోగానే సహాయకారిగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ కమిటీ గదుల వేలంలో రూ.2.64 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల మార్కెట్ కమిటీ వేలం పాటలో సంవత్సరానికి రూ.2.64 లక్షల ఆదాయం వస్తుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి తెలిపారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో 8 గదులకు వేలం నిర్వహించారు. ఒక్కో గదికి రూ.2700 చొప్పున ఆదాయం వచ్చిందని, ఐదేళ్లకు అగ్రిమెంట్ చేసి ఇచ్చినట్టు చైర్‌పర్సన్ చెప్పారు. అలాగే ఏటా ఐదు శాతం అద్దె పెరుగుతుందన్నారు. రెండు గదులకు వేలం నిలిచిపోయిందని, ఉన్నతాధికారుల అనుమతితో మళ్లీ వాటికి వేలం నిర్వహిస్తామన్నారు. ఇప్పుడు వేలంలో గదులు పొందిన వారు సకాలంలో అద్దెను చెల్లించకపోతే వేలం రద్దు చేసి ఇతరులకు గదులను అప్పగిస్తామన్నారు. వేలం పాటలలో ఆర్‌జేడీఎం రామాంజునేయులు, డీఏటీఎంఓ పరమేశ్వర రెడ్డి, డీఈ హరినారాయణ రెడ్డి, కార్యదర్శి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు


డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి

రొంపిచెర్ల: డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని మోటుమల్లెల, పెద్దమల్లెల గ్రామాల నుంచి 15 మంది డప్పు కళాకారులు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకున్నారని, రెవెన్యూ అధికారులు విచారణ చేసి కార్డులను మంజూరు చేసినట్లు చెప్పారు. వారికి త్వరలోనే పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. పార్టీలకతీతంగా డప్పు కళాకారులకు పెన్షన్లు మంజూరు చేస్తున్నామని, ఇంకనూ ఎవరైనా కళాకారులు ఉన్నపక్షంలో దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయశేఖర్, నూలు రెడ్డెప్ప, సర్పంచ్ ప్రసాద్ నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనాధనాయుడు, భాస్కర్ రెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.


క్రీడలతో ఆరోగ్యం : జెడ్పీటీసీ

- మేకలచిన్నేపల్లెలో అట్టహాసంగా జోనల్ క్రీడలు ప్రారంభం


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు, వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చౌడేపల్లె: క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు అన్నారు. శుక్రవారం మేకలచిన్నేపల్లె ఉన్నతపాఠశాలలో పుంగనూరు జోనల్ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను ఎంపీపీ రామ్మూర్తితో కలిసి ఆయన ప్రారంభించారు. సమావేశంలో వారిద్దరూ మాట్లాడారు. గ్రామీణ విద్యార్థులు అటు చదువు, ఇటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడలకూ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్దపంజాణి మండలాలనుంచి 28 జట్ల క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరా హోరీగా పోటీలు సాగాయి. గెలుపొందిన జట్లకు శనివారం బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎం నాగమల్లిక తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ యోగానంద, పీఎంసీ కమిటీ చైర్మన్ మధుసూధనరెడ్డి, ఎంఈఓ కేశవరెడ్డి,, పీడీలు రామచంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'చెకుముఖి' పోస్టర్ల ఆవిష్కరణ



బైరెడ్డిపల్లె: రాష్ట్ర విద్యాశాఖ సహకారంతో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న చెకుముఖి పరీక్షలను విజయవంతం చేయాలని ఎంఈఓ సాయిలీల కోరారు.. ఆదర్శ పాఠశాల వద్ద శుక్రవారం చెకుముఖి సైన్స్ సంబరాలు పోస్టర్లను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. ఈనెల 30న విద్యార్థులకు చెకుముఖి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ2 సుబ్రమణ్యం, జేవీవీ జిల్లా అధ్యక్షుడు గిరిధర్‌మూర్తి, మండల అధ్యక్షుడు శశికుమార్ ఏపీఎంఎస్ ప్రిన్సిపల్ అనిత, సీఆర్పీ షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.